విజయవాడ,
08.01.2024.

గౌరవనీయులైన ఛైర్మన్ మరియు సభ్యులు,
ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్,
హైదరాబాద్.

ఆర్యా,

విషయం: రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు 2024–25 సంవత్సరానికి సంబంధించిన వార్షికాదాయ అవసర నివేదికలపై గౌరవ కమిషన్ వారి ఒపి 65, 66, 67/2023పై మా అభిప్రాయాలు/ సూచనలు/ అభ్యంతరాలు తెలుపుట గూర్చి–

గౌరవ కమిషన్‌వారు 2023 డిసెంబర్ 10వ తేదీన జారీ చేసిన బహిరంగ ప్రకటన మేరకు ఈ కింది విధంగా నివేదించుతున్నాము. వాటిని పరిశీలించి తగు నిర్ణయం చేయాలని కోరుతున్నాము.

గౌరవ కమిషన్‌వారు 2024–25 సంవత్సరానికి సంబంధించిన వార్షికాదాయ అవసర నివేదిక (ఎఆర్ఆర్)లపైన, ఐదవ కంట్రోల్ పీరియడ్‌కు సంబంధించిన మల్టీ ఇయర్ టారిఫ్ (ఎంవైటి)పైన ఒకేసారి పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తున్నారు. తొలుత ఎంవైటి ని నిర్ధారించి, ఆ ప్రాతిపదికన ఎఆర్ఆర్ చేపట్టడం ధర్మంగా ఉండేది. ఇప్పుడైనా ఈ రెండు అంశాలపై విడివిడిగా పబ్లిక్ హియరింగ్ నిర్వహించే విషయాన్ని పరిశీలించాలని కోరుతున్నాము. అలాగే హియరింగ్‌లను మూడు డిస్కాముల పరిధిలో ప్రత్యక్షంగా నిర్వహించాలనీ కోరుతున్నాము.

మూడు డిస్కాములవారు 2024–25 సంవత్సరానికి ఆదాయ లోటు రూ. 13,887.28 కోట్లుగా పేర్కొన్నారు. గతంలో వున్న టారిఫ్‌నే కొనసాగిస్తాం (సోలార్ ప్యానెల్ తయారీదార్లకు భారీ రాయితీ, రైల్వేలకు టారిఫ్ పెంపు వంటివి మినహా) అన్నారు. అయితే ఈ భారీ లోటు పూడ్చడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టంగా ఏం చేస్తుందో చెప్పకుండా జీవో 161 ప్రకారం లోటు భర్తీ ఉంటుందన్నారు. అయితే, డిస్కాములు ప్రస్తుతం ట్రూఅప్ చార్జీలతోపాటు ఎలాంటి ప్రతిపాదన, పబ్లిక్ హియరింగ్ నిర్వహించకుండానే ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల పేరిట యూనిట్‌కు నెలకు 40 పైసల చొప్పున వినియోగదార్ల నుండి వసూలు చేస్తున్నారు. రానున్న ఏడాదిలోనూ అలా చేస్తారా లేదా అన్నది స్పష్టత లేదు. అట్టి వసూళ్లను అనుమతించరాదని, ట్రూఅప్ చార్జీల విధానాన్ని రద్దు చేయాలని కోరుతున్నాము.

మూడు డిస్కాములకు 2024–25 సంవత్సరానికి 83,117.65 మియూ అవసరం కాగా 88,507.20 మియూ అందుబాటులో వున్నందున 5,389.55 మియూ మిగులు తేలుతుందని పేర్కొన్నాయి. అయితే, ఈ మిగులు విద్యుత్ అమ్మకం గురించి ఏమీ చెప్పలేదు కానీ 421.09 మియూ విద్యుత్‌ను స్వల్పకాలిక కొనుగోలు చేయాలన్నారు. మిగులు తేలిన విద్యుత్‌కు ఫిక్సెడ్ చార్జీల పేరిట పెద్ద మొత్తాన్ని ముట్టజెప్పడం, మరోవైపు స్వల్పకాలిక కొనుగోళ్లలో అధిక ధర చెల్లించడం జరుగుతోంది. (2023–24 సంవత్సరంలో డిస్కాములు యూనిట్ ఎనిమిది రూపాయల కన్నా ఎక్కువ పెట్టి కొన్నట్టు అంచనా) కాబట్టి వినియోగదార్లపై భారం పడని రీతిలో మిగులు విద్యుత్ అమ్మకం, స్వల్పకాలిక కొనుగోళ్లలో డిస్కాములకు పరిమితులను, ఈ వ్యవహారాల్లో పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని కోరుతున్నాము.

రాష్ట్ర ప్రభుత్వం మూడు డిస్కాములకు సబ్సిడీగా చెల్లించవలసినది రూ.22,234.60 కోట్లు బకాయిగా ఉందని పేర్కొన్నాయి. ఇంత భారీమొత్తాన్ని ప్రభుత్వం బకాయిపెట్టడంతో డిస్కాములు అధిక వడ్డీలకు రుణాలు తీసుకోవలసివస్తోంది. ఆ భారం వినియోగదార్లపైనే పడుతుంది కనుక ప్రభుత్వం సకాలంలో బకాయి చెల్లించేలా గౌరవ కమిషన్‌వారు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

యాభై వేల రూపాయలకన్నా ఎక్కువ మొత్తాలు బాకీపడ్డ వినియోగదార్లు 2023 సెప్టెంబర్ నాటికి ఎస్‌పిడిసిఎల్ కు రూ.3237.32 కోట్లు, ఇపిడిసిఎల్‌కు రూ.1295.51 కోట్లు చెల్లించవలసివుంది. అయితే ఈ బకాయిల వసూళ్లకు డిస్కాములు

చేస్తున్న కృషి, అలాగే అందుకు వారికి ఎదురవుతున్న ఇబ్బందులు పేర్కొంటే బాగుండేది. యాభై వేల రూపాయలకన్నా ఎక్కువ మొత్తాల బాకీల వసూలుకు నిర్దిష్ట కాల పరిమితితోసహా ఒక విధానాన్ని రూపొందించి అమలు చేయాలని కోరుతున్నాము.

రాష్ట్రంలో స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్ల ఏర్పాటుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. వ్యవసాయ పంప్‌సెట్లకు వాటిని ఏర్పాటు చేయడానికి సర్కారు ఖజానానుండి వేల కోట్ల రూపాయలను అదానీ గ్రూప్, షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ ఇంకా ఇతర ప్రైవేటు కంపెనీలకు కట్టబెడుతున్నారని మీడియా కోడై కూస్తోంది. అదే విధంగా ప్రస్తుతం పని చేస్తున్న మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను ఇతర కనెక్షన్లకూ సదరు వినియోగదార్ల అనుమతి లేకుండా ఏర్పాటు చేయడం విద్యుత్ చట్టం సెక్షన్ 47(5) ప్రకారం చెల్లదు. గడచిన ఏడాది పబ్లిక్ హియరింగ్ సందర్భంగా నాతోపాటు (టారిఫ్ ఆర్డర్ పేరా 271) ఇంకొందరు అభ్యంతరదార్లు తమకు ఈ విషయమై విన్నవించియున్నాము. ఆ మేరకు గౌరవ కమిషన్‌వారు స్పందించి ఒపి81 తేదీ 27.12.2023 లో స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్ల ఏర్పాటును ప్రస్తుతం తిరస్కరించి, కమిషన్ వద్దకు తిరిగి సాధారణ పద్ధతిలో రావాలంటూ ఉత్తర్వులిచ్చినందులకు ధన్యవాదములు. ప్రజా ధనం వృథా కాకుండా నివారించేందుకు ఇప్పుడు అవసరంలేని స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటును తిరస్కరించాలని కోరుతున్నాము.

పైన పేర్కొన్న అంశాలతోపాటు ఇంకొన్ని విషయాలపై కొద్ది రోజుల తరువాత మేము సమర్పించే సూచనలు/ అభ్యంతరాలను గౌరవ కమిషన్‌వారు పరిగణనలోకి తీసుకోవాలని, పబ్లిక్ హియరింగ్‌లో విజయవాడ ఎస్‌ఇ కార్యాలయం నుండి పాల్గనుటకు నన్ను అనుమతించాలని మనవి చేస్తున్నాను. వీలుంటే జనవరి 30వ తేదీ ఉదయం పాల్గనే అవకాశం కల్పించాలని కోరుతున్నాను.

ఇట్లు,

బి తులసీదాస్,
సి బ్లాక్ 406, అమరావతి ఐకాన్,
తాడేపల్లి- 522501.

ఇందు కాపీలు మూడు డిస్కాముల వారికి పంపడమైనది.